# ఏప్రిల్ ఫూల్

-గుడిసేవ సుందరరామయ్య

ఆఫీసు పనితో అలిసిపోయిన ఆనందరావు, ఆరు కాకముందే ఇల్లు చేరుకొన్నాడు. వాకిట్లో ఆడు కొంటున్న నాలుగేళ్ల శశి పరుగుపరుగున తండ్రిదగ్గరకు వచ్చి, అతని చేతులవైపు పరీక్షగా చూసింది. తన కోసం తండ్రి ఏమీ తీసుకురాలేదని నిర్ధారణ చేసుకొని, "ఇవ్వాలకూడా బిస్కత్తులు తేలేదా, నాన్నారూ?" అని విచారంగా అడిగింది.

ఆనందరావు ముఖం క్షణంపాటు వివర్ణమైంది.

ఆ రోజు సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేటప్పుడు తప్పకుండా బిస్కట్లడబ్బా తెచ్చి ఇస్తానని పొద్దున్నే శశికి వాగ్దానం చేయటం, తను ఆఫీసు వదిలిన తరవాత బజార్లోకి రావటం, బిస్కట్లు కొందా మని జేబులు తడుముకోవటం — అంతా గుర్తు వచ్చింది. అప్పటికి మిగిలిన చిల్లరడబ్బు మరునాడు జీతం పుచ్చుకొనే వరకు పొదుపుగా వాడుకోవాలని స్ఫురణకి రాగానే, కనీసం బిస్కట్ల డబ్బాలవైపు చూడనైనా చూడకుండా వచ్చేశాడు తను.

"ఏం, నాన్నారూ! ఎందుకు తేలేదు?" అని శశి తిరిగి ప్రశ్నించేసరికి, "ఇవ్వాళ అక్కడ మంచి బిస్కత్తులు లేవమ్మా! రేపయితే మంచిమంచివి వస్తాయట! తప్పకుండా రేపు తెచ్చి పెడతాను! సరేనా?" అని ఊరడించ టానికి ప్రయత్నించాడు.

"ఆఁ ... అంతా అబద్ధం! రేపుకూడా అలానే చెబుతారు!"

ఆ మాట విన్న ఆనందరావు మనస్సు చివుక్కుమంది. తను లేమిచేత చిన్నపిల్లల దృష్టిలోకూడా చులకనై పోవటం హృదయానికి బాధ కలిగించింది. తన పేదరికాన్ని మరుగుపరచటానికి అభం శుభం తెలియని అమాయిక హృదయులకు అబద్ధాలు చెప్పవలసి వస్తూంది.

తండ్రి మాటలమీద నమ్మకాన్ని కోల్పోయిన శశి, అప్పుడే వంటగదిలోంచి బయటికి వస్తున్న తల్లిని సమీపించి, "అమ్మా! నాన్నారు ఇవ్వాలకూడా బిస్కత్తులు తేలేదే!" అని ఫిర్యాదుచేసి సన్నగా రాగం ప్రారంభించింది.

"మళ్లీ మొదలెట్టావ్! అబ్బబ్బ! ఇప్పటివరకు బాగానే ఉన్నావుగా! మళ్లీ ఏమొచ్చింది?" అని శశిని మందలించి, భర్త దగ్గరకు వచ్చి, "మీరు దాన్ని మరీ గారాం చేస్తున్నారు! ఎన్నిసార్లు చెప్పినా దాన్ని మందలించరు సరికదా, నెత్తి కెక్కించుకుంటారు" అంటూ టిఫిన్‌ప్లేటు దగ్గరికి వెళ్లింది రేణుక.

అప్పుడే సన్నగా రాగం ప్రారంభించిన శశిని ఎత్తుకొని, "అమ్మా! శశీ! నీకు బిస్కత్తులు తప్ప ఇంకేమీ అక్కర్లేదా? రిబ్బన్లు, గౌన్లు, బొమ్మలు—ఇవేమీ అక్కర్లేదా?" అని ఆప్యాయంగా అడిగాడు ఆనందరావు.

"కావాలి! నా కవీ కావాలి!" అంది శశి ఆశతో.

"మరయితే అవన్నీ కొనిపెడతాను కాని, నేను చెప్పినట్లు చేస్తావా?"

శశి తల ఊపింది.

"నీవు ఏడుపు మాని చక్కగా ఆడు కుంటే, రేపు నిన్ను, తమ్ముణ్ణి, అమ్మని, బాబాయిని బజారు తీసుకెళ్లి నీ క్కావలసినవన్నీ కొనిపెడతాను! సరేనా?"

అదే సమయమని అదనుకొంది కాబోలు "మరి నాకు చెప్పులుకూడా కావాలి!" అని అడిగింది శశి.

"తప్పకుండా! మరి పోయి ఆడుకో!" అని శశిని దింపేసి, రేణుక తెచ్చి ఇచ్చిన టవెల్ తీసుకొని బాత్‌రూమ్‌వైపు నడిచాడు ఆనందరావు.

కాఫీకప్పు అందిస్తూ అంది రేణుక: "ఇంతకుముందే సేఠ్ గంగారాంగారొచ్చి వెళ్లారండి. బాకీ విషయం చెప్పటానికి వచ్చారట! కనీసం వడ్డీ అయినా ఇచ్చే ఏర్పాటు చేయమన్నారు."

సేఠ్ గంగారాం అనగానే గళ్లలుంగీ, కోరమీసాలు, వదులుగా వేలాడే లాల్చీ, నిప్పుకణాల్లాంటి కళ్లు, పోతపోసిన శిలా విగ్రహంలాంటి ఆకారం—ఆనందరావు కళ్లముందు మెదిలింది.

"ప్రతినెలా వడ్డీ జమ కడుతూ ఉంటే అసలు అసలుగానే మిగిలిపోతుంది! ఈ నెల్లో లోన్‌కు అప్లయి చేశాను కాబట్టి అసలులోనే కొంత వసూలు వేయిస్తాను. లేకపోతే వాడి అప్పు ఆ జన్మాంతం తీరేటట్లు లేదు! ఏం అప్పులో ఏమిటో? ఈ అప్పుల్లోంచి అసలు నేను బయటపడతానో, లేదో?" నిట్టూర్చాడు ఆనందరావు.

"అలా ఆధైర్యపడితే అప్పులు తీరి పోతాయేమిటండీ! మీరు మరీను! ఎప్పటి కైనా మంచి రోజులు వస్తాయని సరి పెట్టుకోవాలి కాని! అన్నట్లు చెప్పటం మరిచాను! ఈవారం పత్రికలో మీ రాశిఫలం చూశానండి! మీకు అన్ని రంగాల్లోనూ అనుకూలంగా ఉంటుందట! ఖర్చుతో కూడిన ప్రయాణాలు చేస్తారట! ధనలాభంకూడా కలుగుతుందట!" అంది రేణుక మెరుస్తున్న కళ్లతో.

"ఇంకా వారఫలాలను నమ్ము తున్నావా, రేణూ? నా జీవితంలో నిష్ప్రయోజనమైపోయిన అలాంటి వార ఫలాలను ఎన్నిసార్లో చూశాను! ఆత్మ తృప్తి మినహా నా లాంటి దురదృష్టవంతు లకు వాటివలన ప్రయోజనం శూన్యం." జీవితాన్ని బాగా జీర్ణించుకున్న వేదాంతిలా కనపడ్డాడు ఆనందరావు ఆ క్షణంలో.

"విచారపడితే మాత్రం ప్రయోజన మేమున్నదండి? మన ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని, కొన్ని ఖర్చులను తగ్గించుకుంటే కొంతైనా ఊరట లభి స్తుంది. మనకంటె తక్కువ ఆదాయంతో ఎక్కువ మంది పిల్లల్ని పోషిస్తూ ఎంతమంది జీవితాల్ని గడపటం లేదు? చెబితే మీకు కోపం వస్తుంది కాని, అసలు ఆదాయాన్ని పెంచి, ఖర్చును తగ్గించటం మీ చేతుల్లోనే ఉంది. మీరు రోజూ ఆడే. . ."

"ఆ పేకాట మానేయమంటావ్!" భార్య మాట పూర్తి కాకముందే అందు కున్నాడు.

కాఫీ తాగేసి కప్పును రేణుక చేతి కిస్తూ, "నీకు తెలీదు కాని, రేణూ! అసలీ పేకాటమూలంగానే నాకు అడపా తడపా రోజుకు సగటున ఓ రెండు మూడు రూపాయిలైనా గిట్టుబాటవు తున్నాయి" అన్నాడు.

"ఇవ్వాళ రూపాయి వస్తే, రేపు రెండు రూపాయిలు పోతాయి! ఈ పేకాటలో సంపాదించి బాగుపడిన వాళ్లను నే నింతవరకు చూడలేదు! మరి, మీకు మాత్రం అదో లాభదాయకమైన వ్యాపారంలా ఉంది!" అంటూ ఖాళీ కప్పును తీసుకొని లోనికి వెళ్లింది రేణుక.

ఆనందరావు రేణుక వెళ్లిన దిక్కే చూస్తూండిపోయాడు.

* * *

ఆనందరావు బజారునుంచి తిరిగివచ్చే సరికి తొమ్మిది దాటింది.

తమ్ముడు నాను హాల్లో చదువు కొంటున్నాడు.

వంటవాడు ప్రశాంతంగా మంచం మీద పడుకొన్నాడు.

రేణుకమాత్రం శశిని నిద్రపుచ్చుతూ, భుజాన వేసుకుని అటు ఇటు పచార్లు చేస్తూంది.

పక్కగదిలోంచి ముసలమ్మ దగ్గు వినిపిస్తూంది.

భుజాన నిద్రపోయిన శశిని మంచం మీద పడుకోబెట్టి, భర్తకు భోజనం వడ్డించింది రేణుక.

కాళ్లు కడుక్కు వచ్చిన ఆనందరావు భోజనానికి ఉపక్రమించేసరికి, పక్క గదిలోంచి ముసలమ్మ దగ్గు మరీ విపరీతంగా వినిపించింది.

ఆమె పడుతున్న బాధను గమనించి, "ఈ పూట అమ్మమ్మకు మందివ్వ లేదా, రేణూ?" అని అడిగాడు.

"టానిక్ మొన్ననే అయిపోయింది. టాబ్లెట్స్‌కూడా పొద్దున్న వరకే వచ్చాయి" అంది రేణుక కూర వడ్డిస్తూ.

ఆనందరావు మారుమాట్లాడకుండా మౌనంగా భోజనం ముగించుకొని, పక్కగదిలోకి వెళ్లి అమ్మమ్మను పరామర్శించి వచ్చి మంచంమీద వాలిపోయాడు.

'పాపం! అమ్మమ్మను తలుచుకుంటే జాలి వేస్తూంది. కొడుకు పోయాడనే విచారం మానసికంగాను, ఎంతోకాలంగా ఆశ్రయించిన ఈ పాడు దగ్గు శారీరకం గాను ఆమెను బాధ పెడుతున్నాయి. తన మీదున్న ప్రేమ చేతనైతేనేమి, చని పోయిన ఆమె కొడుక్కి, తనకు పోలికలు ఉండటం చేతనైతేనేమి ఆమె శేష జీవితాన్ని తన దగ్గిరే గడపటానికి నిర్ణ యించుకుంది. అమ్మమ్మకు స్వస్థత చేకూర్చాలనే తాపత్రయంతో తను ఎన్నో మందు లిప్పించాడు. అయినా, ఆమెను వ్యాధి వీడటం లేదు. పోనీ, గుంటూరు

తీసుకెళ్లి, పెద్దడాక్టర్లకుచూపిద్దామంటే ఎంతో డబ్బు కావాలి. తన సంపాదనంతా గతంలో చేసిన అప్పులకే సరిపోతూంది. పాపం! రెండు వందల మైళ్ల దూరంలో ఉన్నా, రాముడన్నయ్య ప్రేమతో ప్రతి నెలా ఓ అరవయ్యో, డెబ్బయ్యో పంపిస్తున్నాడు కాబట్టి కొన్ని కుటుంబపు ఖర్చులు తీరుతున్నాయి. లేకపోతే తన సంపాదన మీదే తన కుటుంబం, తమ్ముడి చదువు, స్వంతఊరు వదిలి రామని మొండిగా పట్టుబట్టిన తలిదండ్రుల పోషణ— అన్నీ నర్దుకుపోవాలంటే ఊహాకందని విషయం.

ఏ నాటికైనా తన జీవన జలధిలోంచి ఒడ్డుకు చేరగలడా? తన కల లా అదృష్టం ఉందా? అదృష్టమంటే గుర్తు వచ్చింది. తనచేత బలవంతాన మొన్న లాటరీ కట్టించాడు లక్ష్మీపతి. మొదటి బహుమతి లక్ష రూపాయలు. . . దేవుడు చల్లగా చూసి ఆ అదృష్టదేవత తనను వరిస్తే తన సమస్యలన్నీ పరిష్కారమైపోతాయి! తన పిచ్చికాకపోతే, తనలాంటి దురదృష్టవంతుని ఆ లక్ష్మీదేవి మాత్రం వరిస్తుందా? తన కే లాటరీలు అక్కర్లేదు. రేపు వచ్చే జీతంతోను, లోన్ తోను గంగారాంకు కొంత జమకట్టి, బట్టలకొట్టు వాని అప్పు తీర్చేసి, ఇంకా చేసిన చిల్లరబాకీలన్నీ తీర్చేసి, ఇంట్లో అందరికీ బట్టలు కుట్టించగలిగితే చాలు!

ఎప్పుడో ఆర్నెల్ల క్రితం కాబోలు, బాబాయి కూతురు పెళ్లి సందర్భంలో తను పిల్లలకి బట్టలు కుట్టించాడు. రేణుకకికూడా చీర లెక్కువ లేవు. ముందు మంచి నహజంగా చీరలంటే మోజు ఎక్కువే అయినప్పటికీ, తన ఆర్థిక పరిస్థితిని అవగాహన చేసుకుంది కాబట్టి బలవంతాన కోర్కెను మనస్సులోనే దాచుకొంటూంది. ఆదాయాన్నిబట్టి ఖర్చు తగ్గించేయాలంటుంది. తనను పేకాట మానేయమంటుంది. మంచిదే. కాని, ఎంత మానేద్దామనుకున్నా సాయంత్రమయ్యే సరికి ఆ క్లబ్‌కు వెళ్లకుండా ఉండలేక పోతున్నాడు తను! ఆ క్లబ్‌లో ఈమధ్య తను పోగొట్టుకొంటున్న డబ్బు ఇంటి అద్దెకు సరిపోతుండటం మాటికి మారుపాళ్ళ నిజం. కాని, అలవాటు పడిన ఈ ప్రాణం ఆ ఛాయలను వదలగలదా? కనీసం ఓ రెండురోండ్లయినా వేయకుండా తిరిగి రాగలడా? ఏమైనా పేకాట మానేయాలి. పేకాటలో తనకు లాభాలు వస్తాయని చెప్పి రేణుకన్నైతే మభ్యపరచటానికి ప్రయత్నిస్తున్నాడు కాని, తన కూతుర్ని మాత్రం అబద్ధాలతో మభ్యపెట్టలేకపోతున్నాడు తను! ఏమైనా రేపు జీతం తీసుకోగానే దానికి వాగ్దానం చేసిన వస్తువులన్నీ తీసుకురావాలి. . . అమ్మమ్మకు మందులు తేవాలి! పేల్ జీకి వసూలు వేయాలి! బట్టలకొట్టువాడి అప్పు తీర్చేసి, అందరికీ బట్టలు కుట్టించాలి. . .'

మరునాటి కార్యక్రమాలను గూర్చి ఆలోచిస్తూ నిద్రపోయాడు ఆనందరావు.

అనుక్షణమూ ఆకాశాన్నంటుకోవాలని ఆరాటపడుతున్న అధిక ధరలమధ్య చాలీచాలని జీతాలతో సతమతమైపోతూ, ధరలతోపాటు పోటీగా పెరుగుతున్న సంసారాన్ని, సంసారపు బాధ్యతల్ని మోసే గుమాస్తాలు రేపు జీతాలు తీసుకుంటారనగా ఎంతో ఆనందంగా, తృప్తిగా, ఉల్లాసంగా ఉంటారనటంలో అతిశయోక్తి కాని, అసత్యంకాని లేదు. మరునాడు జీతాలిస్తారని తెలుసుకుని ఆ రాత్రల్లా బడ్జెట్ తయారుచేయటంలో నిమగ్నులౌతారు. మరునాడు జీతాలు తీసుకొని బాకీలు సర్దేసి చూసుకుంటే వారికి మిగిలేవి నిరాశా నిస్పృహలు మాత్రమే! జీతాలు తీసుకున్న మరునాటినుంచే ప్రారంభమౌతుంది అప్పులకోసం అన్వేషణ, మరుసటి నెల జీతాలకోసం నిరీక్షణ!

* * *

ఆ రోజు పది కాకముందే పాత సైకిలు తీసుకుని ఆఫీసుకు బయల్దేరాడు ఆనందరావు.

వెళుతూ వెళుతూ, భార్యను పిలిచి, "రేణూ! నేను సాయంత్రం ఐదయ్యేసరికల్లా వచ్చేస్తాను. నేను వచ్చేసరికి మీ రంతా రెడీగా ఉండండి! షాపింగ్‌కు వెళదాం! వంటకూడా సాయంత్రం పెందలకడనే చేసెయ్!" అని సైకిలెక్కి రివ్వున తూనీగలా దూసుకుపోయాడు ఆనందరావు.

చలాకీగా ఆఫీసుకు వెళుతున్న ఆనందరావును చూసి రేణుక నిండు హృదయంతో నవ్వుకొంది.

తన పెళ్లయిన కొత్తరోజుల్లో ఉండే చలాకీ, హుషారు ఆయనలో క్రమేపీ రూపుమాసిపోవటం తనకు తెలుసు! సంసార జలధిలో పడి సతమతమైపోతూ నిరాశానిస్పృహలకు ఆయన బానిస కావటం కూడా తనకు తెలుసు! అయినా, ఆయన ప్రతి నెలా ఒకటవ తేదీని గతంలోని హుషారును, చలాకీతనాన్ని ప్రదర్శించుకోవటం, తను తృప్తిగా నవ్వుకోవటం మామూలైపోయింది.




* * *

సాయంత్రం ఐదయ్యే సరికల్లా ఆనందరావు ఇల్లు చేరాడు.

అతను వచ్చేసరికి రేణుక తన టాయిలెట్ చేస్తూంది.

వంటవాడు ఉయ్యాల్లో పడుకున్నాడు.

వస్తూ రావటంతోనే, "ఏమిటి? ఇంకా తయారు కాలేదా? ఆలస్యంచేస్తే లాభం లేదు. మనం ఓ గంటలో షాపింగ్ పూర్తి చేసుకోవాలి! వాను ఇంకా స్కూలు నుంచి రాలేదా?" అని తీవ్రంగా అడిగాడు.

"వచ్చాడండి! స్నానం చేస్తున్నాడు!" అంది రేణుక కూతురి తలలో గులాబి పువ్వును తురుముతూ.

"అయితే, వాణ్నికూడా త్వరగా తయారుకమ్మని చెప్పు! మనకు ఎక్కువ టైమ్‌లేదు" అని మూడడుగులు ముందుకేసి ఏదో గుర్తుకు వచ్చినవానిలా ఆగిపోయి, "చెప్పటం మరిచాను. షాపింగ్ పూర్తిచేసుకొని ఫస్టుషో సినిమాకు వెళదాం! 'ఏప్రిల్ ఫూల్' కు టిక్కెట్లు బుక్ చేయమని మా ఫ్రెండుకు చెప్పి వచ్చాను. క్విక్! మీ రంతా త్వరగా



కళా నిలయం

ఫోటో—పి. ఎస్. రావ్ (భోపాల్)

తయారుకండి! నేను మొహం కడుక్కు వస్తాను" అని టాప్ దగ్గిరికి వెళ్లాడు ఆనందరావు.

"టెలిగ్రామ్ సార్!" అన్న మెసెంజర్ కేక వినపడగానే హడావిడిగా మొహం తుడుచుకుంటూ బయట గుమ్మం దగ్గరకు పరిగెత్తాడు ఆనందరావు. రేణుక, వాసు, శశి ఆనందరావును అనుసరించారు.

ఆనందరావుకు ఆత్రత, ఆవేదన అధికమయ్యాయి.

ఆ టెలిగ్రామ్‌లోని సమాచారం ఎటువంటిదో?

సంతకం చేస్తుంటే చేతివేళ్లు వంకర్లు తిరిగాయి! కాళ్లు వణికాయి! గుండె దడదడ లాడింది!

టెలిగ్రామ్‌లోని విషయాన్ని చదివిన ఆనందరావుకు మతి చలించినట్లయింది!

కలా? నిజమా?

కళ్లు నులుముకుని చూశాడు.

టెలిగ్రామ్‌లోని సారాంశమేమీ మారినట్లు లేదు.

అంతే!

ఏదో తీరని వ్యథ, అవ్యక్తమైన ఆవేదన అంతరంగంలో అధికమయ్యాయి.

శరీరంలోని నరాలన్నీ జివ్వున లాగాయి. నోటివెంట మాట రాలేదు!

కళ్లవెంట నీళ్లు కారుతున్నాయి!

అతనికి కన్నీటిపొరల వెనక కనిపించింది ఓ త్రాసు మాత్రమే! ఓ పళ్లెంలో తన రాముడన్నయ్య రూపం, వేరొక పక్క పళ్లెంలో పేక్ జీ, బిట్టలకొట్టు వాడు, అమ్మమ్మ, రేణుక, శశి, వాసు, వంటవాడు, సినిమా హాలు కనిపించేసరికి, "అన్నయ్యా!" అంటూ టెలిగ్రామ్ క్రింద పడేసి తన గదిలోకి వెళ్లి మంచం మీద పడిపోయాడు.

"ఏమైందండి?" అంటూనే కంగారుగా క్రింద పడి ఉన్న కాగితాన్ని తీసుకొని చూసింది.

"బ్రదర్, ఆక్సిడెంట్, సీరియస్" అన్న మూడు మాటలకు రెండు కన్నీటి బొట్లు రాల్చింది రేణుక.

ఆఫీసుకు సెలవు పెట్టి సోదరుని అంత్యక్రియలు జరపటానికి సకుటుంబంగా బయల్దేరిన ఆనందరావుని చూసి 'పాపం!పూర్ ఫెలో! ఫూలయ్యాడు' అనుకొంటూ జాలిగా, అస్పష్టంగా గొణుక్కుంది అప్పుడే అడుగు పెట్టిన ఏప్రిల్ నెల.

[చిన్న మనవి:— ఒక్క ఏప్రిల్ నెలలో మాత్రమే కాక ప్రతి నెలా అనుకోని ఆటంకాలు వచ్చి అనుకున్న ఆశలు, ఆశయాలు ఆచరణ శూన్యమై, విధి చేతిలో 'ఫూల్స్'గా మిగిలిపోయిన మధ్యతరగతి కుటుంబీకులకు అంకితం.] ★